క్లుప్తంగా

ఎల్‌ఈడీ స్క్రీన్ చోరీ

శంకరపట్నం: గద్దపాక గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాల ఎల్‌ఈడీ స్క్రీన్ చోరీకి గురైంది. గతంలో సర్పంచ్ గదిలో సీసీ కెమెరాకు సంబంధించి స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈనెల 6న ఎల్‌ఈడీ స్క్రీన్ కనిపించకపోవడంతో కార్యదర్శి సుమన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంట్లో చోరీ

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన మడుపు ప్రేమ్‌కుమార్ ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చొరబడి వెండితో పాటు నగదును ఎత్తుకెళ్లారు. ప్రేమ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలోని 6 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దుస్తులు చిందరవందరగా పడేశారు. శనివారం ఉదయం కరీంనగర్ నుంచి ప్రేమ్‌కుమార్ మానకొండూర్‌లోని ఇంటి వద్దకు రాగా.. విషయం బయటపడింది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

మద్యం పట్టివేత

శంకరపట్నం: అంబాల్‌పూర్ గ్రామంలోని బెల్టుషాపులో రూ.22,010 విలువ గల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన వీరస్వామి అనే వ్యక్తి బెల్టుషాపులో మద్యం విక్రయిస్తున్నాడని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులకు సన్మానం

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ శ్రీలక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ డ్రైవర్స్ అండ్ లేబర్ యునియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కవ్వంపల్లి రవి, ఉపాధ్యక్షులుగా శంకర్, న్యాత సాగర్, ప్రధాన కార్యదర్శిగా కోలాపూరి ఆంజనేయులు, కోశాధికారిగా మహంకాళి నాగరాజు, కార్యదర్శిగా చిట్యాల అంజయ్య, గౌరవ అధ్యక్షుడిగా వెదిర రాజ్‌కుమార్, సలహాదారులుగా రాపోలు శ్రీకాంత్, వెదిర శ్రీకాంత్, బుర్ర ప్రశాంత్ ఎన్నికయ్యారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం..



శ్రీనివాస్

తిమ్మాపూర్: పోరండ్లలో ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగపూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మోరపల్లి వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా నాగపూరి శ్రీనివాస్, యాళ్ల మధుసూదన్‌రెడ్డి, తోడేంగ సంపత్, మోరపల్లి సంపత్‌రెడ్డి, క్లెం అనిల్‌రెడ్డి, క్లెం ఎల్లారెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయండి

శంకరపట్నం: ఈనెల 6న దేశవ్యాప్తంగా చేపట్టబోయే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ల రాజు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో కార్మికుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేపట్టే బంద్‌లో వ్యవసాయ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు, అసంఘటిత కార్మికులు, హమాలీలు, ఆటో డ్రైవర్లు పాల్గొనాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ పిల్లి రవియాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని, కుటుంబానికి రూ.15లక్షలు ఖాతాలో వేస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పి రైతులను ముంచిందని దుయ్యబట్టారు. వెంకటేశ్, తడిగొప్పుల రాజయ్య, రవి, శంకర్, సదానందం, మల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్: రాష్ట్రంలోని గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘం నాయకులు బీఆర్‌ఎస్‌కు తొత్తులుగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, సమస్యల గురించి గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాల్లేవని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పూర్తి కాని నిర్మాణాలు

- అసంపూర్తిగా కమ్యూనిటీ భవనాలు
- అరకొర నిధులు, స్థల సమస్యలతో నిలిచిన వైనం



వెదిరలో మాల సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం

రామడుగు: కమ్యూనిటీ భవనాలకు ప్రభుత్వం అరకొర నిధులను మంజూరు చేయడంతో వాటి నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. సరిపడని నిధులతో భవనాల నిర్మాణాలు చేయడానికి ముందుకు రావడం లేదు. కొన్ని గ్రామాల్లో నిధులు మంజూరైనా.. వాటి నిర్మాణాలు చేయడానికి స్థల సమస్యలున్నాయి. దీంతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి మండలంలోని 23 గ్రామాల్లో నెలకొంది.

68 కమ్యూనిటీ హాళ్లు మంజూరు

మండలంలోని 23 గ్రామాల్లో పలు కుల, మహిళ, యువజన సంఘాలకు దాదాపు 68 వరకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో సీడీపీ నిధులతో 12, ఉపాధిహామీ నిధులతో ఒకటి, డీఎంఎఫ్ నిధులతో 10, ఎస్‌జీఎఫ్ నిధులతో 45 నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తూ ప్రొసీడింగ్స్ విడుదల చేశారు. వీటి నిర్మాణాలు చేయడంలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది.

అరకొర నిధులే..

కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం అరకొర నిధులు మంజూరు చేయడంతో.. వాటి నిర్మాణాలు చేయడానికి ఎవరు ముందుకు రాని పరిస్థితి మండలంలో నెలకొంది. ప్రభుత్వం కొన్ని కమ్యూనిటీ హాళ్లకు రూ.4.60లక్షలు, కొన్నింటికి రూ.4లక్షలు, మరికొన్నింటికి రూ.5లక్షలు, కొన్ని కమ్యూనిటీ భవనాలు అసంపూర్తి నిర్మాణాలుండడంతో.. వాటిలో బ్యాలెన్స్ పనులు చేయడానికి ఒక్కదానికి రూ.లక్ష50వేలు మంజూరు చేశారు. కాగా కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల మేర ఖర్చు కానుండడంతో.. వీటి నిర్మాణాలు ముందుకు సాగని దుస్థితి నెలకొంది.

స్థల సమస్య..

ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. వాటి నిర్మాణాలు చేయడానికి గ్రామంలో స్థలం అందుబాటులో లేక పనులు ప్రారంభం కాని పరిస్థితి ఉంది. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతోనే పనులు ప్రారంభమవడం లేదు. అధికారులు కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగేలా చొరవ చూపితే పూర్తయ్యే అవకాశాలున్నాయి.

నిధులు కేటాయించాలి



ప్రభుత్వం కమ్యూనిటీ భవనాలకు సరిపడా నిధుల కేటాయింపులు చేయకపోవడంతోనే పనులు జరగని పరిస్థితి ఉంది. కేవలం రూ.నాలుగైదు లక్షలు మంజూరు చేయడంతో పనులు చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదు. కనీసం రూ.10లక్షలైనా కేటాయింపు చేస్తే కమ్యూనిటీ భవనాలు పూర్తయ్యే అవకాశముంటుంది.

– కాడె నర్సింగం, వెలిచాల

చొరవ తీసుకోవాలి



గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల ఆవశ్యకత ఉంది. వీటి నిర్మాణాలు పూర్తయితే సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం దొరుకుతుంది. అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకొని పూర్తి చేయాలని కోరుతున్నా.

– అమిరిశెట్టి సుధాకర్, దేశరాజ్‌పల్లి

పనులు జరుగుతున్నాయి



మండలంలో కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులు చాలా మేరకు సాగుతున్నాయి. కొన్ని చిన్నచిన్న సమస్యలతో ప్రారంభం కాలేదు. వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తాం. నిధులున్నమేర పనులు పూర్తి చేస్తాం.

– సచిన్, ఏఈ, రామడుగు

ఈ వానరాన్ని తీసేదెవరు?



సైదాపూర్: సోమారంలో శనివారం కరెంట్ స్తంభంపై విద్యుదాఘాతంతో కోతి మృతిచెందింది. విద్యుత్ సిబ్బందికి గ్రామస్తులు సమాచారమిచ్చారు. అయినా కూడా సిబ్బంది రావడం లేదు. చచ్చిన కోతి స్తంభం మీదే ఉంది. హిందూ సమాజంలో కోతిని హనుమాన్ దేవుడికి ప్రతిరూపంగా, అంజన్న అని పిలుస్తారు. ఏదైనా ప్రమాదంలో కానీ.. ఇతర కారణాలతో ఎక్కడైనా వానరం మృతిచెందితే.. హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు చేస్తారు. మృతి చిహ్నాలు కట్టిస్తారు. కానీ ఇక్కడ కోతి విద్యుత్ స్తంభంపై మృతిచెందింది. విద్యుత్ సిబ్బంది వచ్చి మాత్రమే తీయాలి. ఫోన్ ద్వారా సమాచారమిచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థుల ప్రదర్శన

గంగాధర: ఉపాధ్యాయులు సమష్టి కృషితో పని చేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారి వేణుకుమార్ సూచించారు. బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈవో, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌కుమార్, మల్లికార్జున్, అనితకుమారి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విలువలు పెంపొందించుకోవాలి

జమ్మికుంట: మానవ జన్మ ఉత్తమమైనదని, మనిషి సుఖవంతంగా ముందుకు సాగాలంటే ప్రతి నిమిషం ప్రశాంతంగా గడపాలని, ఇందుకు ధ్యానం ఎంతో అవసరమని బ్రహ్మకుమారీస్ శ్రీ గుంటి రాజయ్య పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆత్మజ్ఞాన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విలువలు పెంపొందించుకోవాలని, గురువులు బోధించే ప్రతి విషయాన్ని అవగాహన చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంపత్ కుమార్, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి



మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉదయ్, రాము

గన్నేరువరం: కరీంనగర్ నుంచి మండల కేంద్రం మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వరకు ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్, ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము ఆర్టీసీ డిపో మేనేజర్‌కు శనివారం కరీంనగర్‌లో వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ నుంచి గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, జంగపల్లి, హన్మజిపల్లె, మైలారం, గన్నేరువరం, పారువెల్ల మీదుగా ఇల్లంతకుంట వరకు రెండు ఆర్టీసీ బస్సులను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ గ్రామాల గుండా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని అన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమ్మక్క జాతర అనంతరం బస్సులను నడిపిస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే 'గావ్ చలో'



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రెడ్డి

తిమ్మాపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ ఇటీవల గావ్ చలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆదేశాలతో శనివారం కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలో గావ్ చలో కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ తొర్తి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశానికి ప్రవసి కార్యకర్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తలతో భోజనం చేసి ఇక్కడే నిద్ర చేశారు. ఉదయం ఇంటింటా తిరిగారు. యువజన సంఘాలు, యువత, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు, కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులు, ఇటీవల పార్టీలో చేరిన వారిని, పంచాయతీ స్థానిక సంస్థలు, సహకార సంఘాల ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతను కలిసి బీజేపీ సిద్ధాంతాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి వివరించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల నర్సయ్య, రేశవేని అనిల్, రాకేశ్, మణిమహర్షి, నరేష్, పవన్‌కళ్యాణ్, శ్రీనివాస్, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామడుగు: ఈనెల 11, 12ల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్న విద్య–వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రావు, రాష్ట్ర నాయకుడు కిషన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని పాఠశాలలను శనివారం వారు సందర్శించి ఉపాధ్యాయులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. అందరికి సమాన విద్య, అంతరాలు లేని కామన్ స్కూల్ విధానం అన్న నినాదంలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి అర్కాల శ్రీనివాస్, పలువురు సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

జమ్మికుంట: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11, 12ల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆయన మాట్లాడారు. కామన్ స్కూల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని, విద్య అంతా ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి అందరికి సమానమైన విద్యనందించాలని కోరారు. ఈ మహాసభలకు ఉప ముఖ్యమంత్రి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొండపాక తిరుపతి, జమ్మికుంట, ఇల్లందకుంట మండల బాధ్యులు బాబన్న, తిరుపతి ఉన్నారు.

జాతర పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న సిబ్బంది

శంకరపట్నం: మండల కేంద్రంలో జరగబోయే సమ్మక్క–సారలమ్మ జాతర పనులను శనివారం ఎంపీడీవో శ్రీవాణి ప్రారంభించారు. జాతర ప్రాంగణంలో జేసీబీతో మట్టిని చదును చేసి గుంతల్లో మట్టిని నింపారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించారు. జాతర కమిటీ చైర్మన్ గుర్రం స్వామి, బొజ్జ రవి, బండారి తిరుపతి, శ్రీనివాస్, కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్ల నిందితులు?

మానకొండూర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న అంతర్ జిల్లాకు చెందిన కొందరు దొంగలు మానకొండూర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వివిధ ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు దొంగలు పోలీసులకు పట్టుబడ్డట్లు తెలిసింది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



పనులు పరిశీలిస్తున్న వీరబుచ్చయ్య

మానకొండూర్: మానకొండూర్, అన్నారం, లలితాపూర్, శ్రీనివాసనగర్ గ్రామాల్లో పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పరిశీలించారు. గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురుగు కాలువల్లో ఎక్కడెక్కడ చెత్త పేరుకుపోతుందో గుర్తించాలని అన్నారు. గ్రామాల్లో పైపులైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామం శుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీవో రాజేశ్వరరావు, ప్రత్యేకాధికారి విజయలక్ష్మీ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పవిత్రోత్సవాలు

వీణవంక: మామిడాలపల్లి గ్రామ భూనీల సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అంగరంగా వైభవంగా పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. శనివారం పవిత్రోత్సవ సహిత పుష్కర బ్రహ్మోత్సవంలో శ్రీరంగం నుంచి తెచ్చిన దివ్య పవత్ర మాలను శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించి పవిత్రోత్సవం నిర్వహించారు. ఆదివారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం జరగనుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కాగలని మయూరగిరి పీఠాధిపతులు, శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు శ్రీమాన్ శ్రీనమిలికొండ రమణాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు సంతోష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీటీసీ మూల రజితపుల్లారెడ్డి పాల్గొన్నారు.

పీవీకి భారతరత్నపై సంబరాలు



హుజూరాబాద్‌లో స్వీట్లు పంచుతున్న నాయకులు

హుజూరాబాద్: దేశ మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడాన్ని హర్షిస్తూ శనివారం పీవీ సేవాసమితి నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద పీవీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పీవీ సేవాసమితి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సెక్రటరీ బి.మనోజ్, కౌన్సిలర్లు స్వరూప ముత్యంరావు, రాజేంద్రప్రసాద్, వైద్యులు రామలింగారెడ్డి, విద్యాసాగర్, మాధవరావు, కె.శ్రీహరి, బి.సురేష్‌గౌడ్, ఎం.కన్నయ్య, ఆర్.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం

జమ్మికుంట: ఖాదీ వ్యవస్థానక అధ్యక్షుడు పీవీ నరసింహరావుకు భారతరత్న అవార్డు రావడం హర్షణీయమని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్ ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. వావిలాల గ్రామంలో మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో మహారాష్ట్రలోని చరకా చేనేత సంఘం ద్వారా స్ఫూర్తిని పొంది వావిలాల గ్రామంలో పీవీ నరసింహరావు ఖాదీ గ్రామోద్యోగను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఖాదీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చొప్పదండి: రుక్మాపూర్ శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన అమూల్య అనే విద్యార్థిని రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. భారీ వర్షాలు పడి వీధుల వెంట వరదలు వచ్చిన సమయంలో మ్యాన్ హోల్స్ తెరవడం వల్ల మనుషులకు వచ్చే ప్రమాదాల నివారణకు ఈ ప్రాజెక్టు రూపొందించినట్లు విద్యార్థిని తెలిపారు. విద్యార్థినిని ప్రత్యేక అధికారి భార్గవి, ఉపాధ్యాయురాలు స్వప్న అభినందించారు.